కానరాని.. కల్యాణ మండపాలు

- నిర్వాసిత కాలనీల పట్ల ఉక్కు ఉదాసీనత
- పదిహేనేళ్ల క్రితం నిధులు విడుదల చేసి వెనుకడుగు
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం


కణితిలో ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం విడిచిపెట్టిన స్థలం


అగనంపూడిలో కల్యాణ మండపం నిర్మాణానికి కేటాయించిన స్థలం

అగనంపూడి : అగనంపూడి, వడ్లపూడి (కణితి) నిర్వాసిత కాలనీల్లో అధునాతన వసతులతో కల్యాణ మండపం నిర్మించేందుకు ముందుకు వచ్చిన ఉక్కు యాజమాన్యం తర్వాత ముఖం చాటేయడంపై నిర్వాసితులు మండిపడుతున్నారు. పదిహేనేళ్ల క్రితం కల్యాణ మండపం నిర్మించేందుకు ఉక్కు యాజమాన్యం నిధులు విడుదల చేసి, తర్వాత పట్టించుకోపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దశాబ్దంన్నర క్రితం అగనంపూడితో పాటు వడ్లపూడి, పెదగంట్యాడ, గంగవరం కాలనీల్లో అధునాత వసతులతో కల్యాణ మండపం నిర్మించేందుకు స్టీల్‌ప్లాంట్ చెరో రూ. కోటి 20 లక్షలు విడుదల చేసింది. పెదగంట్యాడ, గంగవరం కాలనీల్లో ఫంక్షన్ హాళ్ల నిర్మాణం పూర్తి చేశారు. కణితి, అగనంపూడిల్లో ఆ సమయానికి అనువైన స్థలాలు లభ్యం కాకపోవడంతో నిధులు మురిగి పోయాయి. తర్వాత అగనంపూడి సెక్టార్-1 కాలనీలోని డొంకాడలో 12 సెంట్ల స్థలాన్ని సిద్ధం చేశారు. 2013లోనే స్థలం సిద్ధం చేసి కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, నిర్వాసిత సంఘాలు యాజమాన్యానికి కల్యాణ మండపం కోసం చొరవ తీసుకోవాలని పలుమార్లు వినతులు సమర్పించాయి. జీవీఎంసీ స్థలం ఆక్రమణలకు గురి కాకుండా ప్రహరీ నిర్మించింది. అలాగే కణితి గాంధీ బొమ్మ కూడలిలో సిద్ధార్థనగర్‌కు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిలో సుమారు 20 సెంట్ల స్థలాన్ని రెడీ చేశారు. రెండు చోట్ల స్థలాలు సిద్ధంగా ఉన్నాయి.. కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కార్మిక సంఘాలు, నిర్వాసితులు, పాలకుల ద్వారా విజ్ఞప్తి చేసినా అధికారుల కప్పదాటు వ్యవహారంతో నేటికీ కల్యాణ మండపం కల నెరవేరే పరిస్థితి కనపడడం లేదు.

అగనంపూడిలో 21 నిర్వాసిత కాలనీలతో పాటు దువ్వాడ నిర్వాసిత కాలనీలు వెరసి 50 వేల వరకు జనాభా ఉంటున్నారు. అలాగే వడ్లపూడి, కణితి నిర్వాసిత కాలనీల్లో 16 నిర్వాసిత కాలనీలు ఉన్నాయి. ఇక్కడ కూడా జనాభా 40 వేల వరకు ఉంది. అగనంపూడి, వడ్లపూడి నిర్వాసిత కాలనీల్లో సుమారు 4 వేల మంది ఉక్కు ఉద్యోగులు నివాసముంటున్నారు. వీరితో పాటు వేలాది నిర్వాసిత కుటుంబాలు ఈ కాలనీల్లో ఉన్నాయి. ఉక్కు కర్మాగారంలోని 12 సెక్టార్లలో ఎనిమిది కల్యాణ వేదికలు ఉన్నాయి. అదే అగనంపూడి, కణితిల్లో మాత్రం స్టీల్‌ప్లాంట్ నిర్మించిన ఒక్క వేదిక కూడా లేకపోవడంతో నిర్వాసితులు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు రహదారుల పైనే కానిస్తున్నారు. ఈ కాలనీలను ఆనుకుని పదుల సంఖ్యలో లేఅవుట్లు, కాలనీలు, వందలాది బహుళ అంతస్తులు ఉండడంతో జనాభా పెరుగుతోంది. ఈ క్రమంలో అనువైన ఫంక్షన్ హాళ్లు లేకపోవడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

పెదగంట్యాడ, గంగవరంలలో పూర్తి చేసిన అధికారులు వడ్లపూడి, అగనంపూడి విషయంలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడంపై అగనంపూడి, దువ్వాడ, కణితి, వడ్లపూడి నిర్వాసితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, జీవీఎంసీ ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి కల్యాణ మండపాల నిర్మాణానికి సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నమయ్య కీర్తనల శిక్షణ ప్రారంభం


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి

అగనంపూడి : అన్నమాచార్యుని సంకీర్తనలు ఆనందానుభూతి కలిగిస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి పునరావాస కాలనీ గవర వీధిలోని రామాలయంలో కాపారపు ఫౌండేషన్, గీతాచార్య భక్తి గీతాంజలి గౌరీ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన వేదర్ష అన్నమాచార్య సంకీర్తన శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి సంకీర్తనలను అంకితం చేసి కైవల్యం పొందారన్నారు. నేటి సమాజంలో సనాతన ధర్మం, భక్తి భావన దూరం అవుతున్నాయని, ఈ క్రమంలో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈనెల 24వ తేదీన సంకీర్తన యజ్ఞం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాపారపు ఫౌండేషన్ ప్రతినిధి కాపారపు శివన్నాయుడు, భాస్కర్‌భట్ల సత్యప్రసాద్‌శర్మ, బెండి సత్యం, శీపాన రమేష్‌బాబు, పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, గన్నంరాజు గిరిబాబు, నాగమణి, వివిధ ప్రాంతాల భజన బృందాలు పాల్గొన్నాయి.

క్లుప్తంగా

భారీ అన్నసమారాధన


పైడిమాంబ అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన చేస్తున్న కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కొలువైయున్న శ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని స్థానిక మహిళలు వేకువ జామునే దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అలయంలో పాలు పొంగించి సుప్రభాతంతో అమ్మవారిని మెలుకొలుపును కార్యక్రమాన్ని చేపట్టారు. దూపదీప నైవేద్యం అనంతరం భక్తులకు దర్శనకార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

తులసి మృతికి సంతాపం

అక్కిరెడ్డిపాలెం: మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు తులసి (51) గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. మంగళవారం ఆమె మృతికి భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు సంతాపాన్ని ప్రకటించారు. మహిళా సమస్యలపైన, అగనంపూడి సమస్యలపైన తన దైన శైలిలో పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారని తెలిపారు. సంతాపం ప్రకటించిన వారిలో భెల్ సీటు నాయకులు జి.టి.పి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, కె.నారపురెడ్డి, జి.అచ్చింనాయుడు, కె.కేశ్వ, జి.రాంబాబు, కె.పవన్‌కుమార్ తదితరులున్నారు.

యూజర్ చార్జీల రద్దు కోరుతూ లేఖ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో చెత్తపై యూజర్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి లేఖ పంపారు. ప్రతి ఇంటికి నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున యూజర్ చార్జీలు నిర్ణయించారని, ఈ చార్జీలను సీపీఎం కార్పొరేటర్‌గా తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. తక్షణం కౌన్సిల్ సమావేశం నిర్వహించి చెత్తపై యూజర్ చార్జీలు రద్దు చేస్తూ తీర్మానం చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

భక్తులకు లస్సీ పంపిణీ


లస్సీ పంపిణీ చేస్తున్న తాతాజీ, తదితరులు

సీతమ్మధార : ఎండల తీవ్రత ఎక్కువగా వుండడంతో నక్కవానిపాలెంలోని కనకదుర్గ ఆలయానికి వచ్చిన భక్తులు, ప్రజలకు తాతాజీ అనే భక్తుడు మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లస్సీ పంపిణీ చేశారు. గుప్తాజీ అనే భక్తుడు సోడాలు పంపిణీ చేశారు. దీంతో భక్తులు, స్థానికులు లస్సీ, సోడాలు తాగి ఉపశమనం పొందారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు


పిఠాపురంలోని శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం వద్ద గుడివాడ అప్పలరామ్మూర్తి

అక్కిరెడ్డిపాలెం : ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి, గాజువాక ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్ విజయం సాధించాలని కోరుతూ 68వ వార్డు మింది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి పిఠాపురంలోని ప్రసిద్ధ శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామంలో పూజలు చేశారు. ఇప్పటికే పలు చోట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రసిద్ధ ఆలయాల్లో పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు చేశారు. 175 స్థానాలకు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి విశాఖలో ప్రమాణ స్వీకారం చేయాలని అప్పలరామ్మూర్తి ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఈటి శ్రీరాములు పాల్గొన్నారు.

ఘనంగా సత్యమాంబ, పైడిమాంబ అమ్మవార్ల పండగ


అమ్మవార్ల ఆలయం వద్ద భక్తుల సందడి


పూజలందుకుంటున్న సత్యమాంబ అమ్మవారు

పెదగంట్యాడ : మండలంలోని సీకువానిపాలెం, సీతానగరం ప్రాంతాల్లో వేంచేసిన సత్యమాంబ, పైడిమాంబ అమ్మవార్ల పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. వేకువ జాము నుంచి ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చీర సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సారిపిల్లి నాయుడు, గెద్దాడ అప్పలరాజు, సారిపిల్లి చిన్న, సారిపిల్లి రాజు, గ్రామ కమిటీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోండి


అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాల చెల్లింపునకు రీజినల్ లేబర్ కమీషనర్ (ఆర్‌ఎల్‌సీ) చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ డీవీఆర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం వారు ఆర్‌ఎల్‌సీ కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21వ తేదీ వచ్చినప్పటికి కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో పాటు డిఫాల్టర్లుగా మిగులుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపుపై యాజమాన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణారెడ్డి, అధ్యక్షుడు గళ్లా శంకర్ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సతివాడమ్మ తల్లి సంబరం


గొరపల్లిలో ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు


జాతరలో పాల్గొన్న ప్రజలు

పెందుర్తి: గొరపల్లిలో వెలసిన ఏడు గ్రామాల ఆరాధ్య దేవత సతివాడమ్మతల్లి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తులు పసుపు-కుంకుమలతో పూజలు చేశారు. చీరలు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు అట్టహాసంగా సాగింది. ప్రజలు పిండి వంటలు, పలు రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఎలేనుగు సంబరం అంబరాన్ని అంటింది. ఆనవాయితీగా ఉయ్యాల కంబాల ఘట్టం నిర్వహించారు. భజనలు, దప్పుల వాయిద్యాల నడుమ అనుపోత్సవం వైభవంగా చేశారు. పగటి వేషాలతో యువకులు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గొరపల్లి, కోట్నీవానిపాలెం, గంగమ్మపేట, గొల్లలపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, సంతపాలెం గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేతాజీనగర్‌లో అన్నసమారాధన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు నేతాజీనగర్‌లో పోలమాంబ అమ్మవారి నెల పండగ మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక భక్తులు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారికి కుంకుమ అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఎంవీవీ పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య


యువకుడి మృతదేహం

గోపాలపట్నం : మర్రిపాలెం రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఓ టిఫిన్ దుకాణం ఉంది. అక్కడ రేకుల షెడ్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి కేబుల్ వైర్‌తో ఉరి వేసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతుడి వయసు 30 ఏళ్లు ఉంటుందని అంచనా వేశారు. అతను పసుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుటుంబ సభ్యులెవరైనా మృతదేహాన్ని గుర్తించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు సూచించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మస్తానప్పకు సత్కారం


మస్తానప్పను సత్కరిస్తున్న విభాగాధిపతి బాలకుమార్, కుమారస్వామి, నాయకులు

ఉక్కునగరం : స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్పను మంగళవారం సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా స్టీల్ మెల్ట్ షాప్-1 విభాగం వైఎస్సార్‌టీయూసీ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి బాలకుమార్, సీసీడీ ఇన్‌చార్జి కుమారస్వామి అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో ప్రతి ఒక్కరూ అభిమానించే అతి కొద్ది మంది నాయకుల్లో మస్తానప్ప ఒకరన్నారు. విభాగాల్లో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించడంలో ఆయన సలహాలు, సూచనలు ఆచరణీయంగా ఉంటాయన్నారు. మస్తానప్ప మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దరిగి రవి, బాబూరావు, ఎం. రాంబాబు, చంద్రశేఖర్, వర్మ, సేఠి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూలోకమాత వార్షికోత్సవం

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు వద్ద ఉన్న భూలోమాత అమ్మవారి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చీర, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సాముగరడీలు, నేల వేషాలు, కర్రసాము వంటి సంప్రదాయ నృత్యాలతో సంబరాలు అంబరాన్నంటాయి.

సేవలకు సత్కారం


కీర్తిపట్నాయక్‌ను సత్కరిస్తున్న ఒడిశా శిష్టకరణ అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్: స్థానిక శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తిపట్నాయక్‌ను ఒడిశా భువనేశ్వర్ శిష్టకరణ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ సమావేశానికి ఆమెను విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆమె నిరంతరం చేస్తున్న సేవలు అద్వితీయమని సంఘం ప్రతినిధులు ప్రశంసించారు. అనంతరం ప్రముఖ శాస్త్రవేత్త, పసిఫిక్ ఆసియా అవార్డు గ్రహీత రఘుపాత్రుని భీమారావు చేతుల మీదుగా కీర్తిని సత్కరించారు. సంఘం కార్యదర్శి జక్కువ చక్రపాణి పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం


పెదగంట్యాడలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ : వివేకానందుని బోధనలు అనుసరణీయమని గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వివేకానందుని జీవిత చరిత్రను వివరించారు. అలాగే వారికి కథలు చెప్పారు. గ్రంథాలు చదివించారు.

గాజువాక శాఖా గ్రంథాలయంలో..

గాజువాక : గాజువాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈనెల 15న ప్రారంభమైన ఈ శిబిరంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ నేతృత్వంలో విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం, చదివిన కథలకు అర్థాలు వివరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆటలు, పాటలు సహా చదివిన పుస్తకంపై సమీక్ష జరుపుతున్నారు. ఉదయం పదిన్నర నుంచి 11.30 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, బొమ్మలు తయారు చేయడం వంటి అంశాలలో శిక్షణనిస్తున్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కోరారు.

జీతాలు చెల్లించకపోవడం ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమే


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

అగనంపూడి: తొమ్మిది వందల కోట్ల రూపాయల అడ్వాన్స్ రూపేణా ఉక్కు యాజమాన్యం సేకరించినా నేటికీ ఉక్కు ఉద్యోగులు జీతాలు చెల్లించకపోవడం, ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమేనని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. 1,195 రోజులుగా ఆందోళన చేస్తున్నా, యాజమాన్యంలోగాని, ప్రభుత్వాల్లోగాని కనీసం స్పందన లేకపోవడం, కావాలని కార్మికుల జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడం అన్యాయమన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు ఉక్కులోని డెడికేషన్ పార్కు వద్ద బుధవారం ఉదయం పది గంటలకు వేలాది మంది కార్మికులు పాల్గొని నిరసన తెలపేందుకు నిర్ణయించామని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ పాలనలో నియమితులైన ఉక్కు సీఎండీలు, డైరెక్టర్లు వివాదస్పదంగా వ్యవహరిస్తూ అనవసర ఖర్చులు తగ్గించకుండా యథేచ్ఛగా షికార్లు చేస్తున్నారని, ఈవిషయంలో ఉక్కు మంత్రిత్వశాఖ చోద్యం చూస్తోందని ఆరోపించారు. ఈవ్యవహారాలపై సీబీఐ, విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, మధు, పీఆర్‌కే రాజు, గుమ్మడి నరేంద్ర శ్రీనివాసనాయుడు, దాసరి శ్రీనివాస్, టక్కు సత్యనారాయణ పాల్గొన్నారు.

కళాకృతుల తయారీలో శిక్షణ


శిక్షణలో పాల్గొన్న చిన్నారులు


చిన్నారులు తయారీ చేసిన కళాకృతులు చూపుతున్న అనసూయాదేవి తదితరులు

మల్కాపురం: పనికి రాని వ్యర్థ పదార్థాల నుంచి మంచి వస్తువులు తయారు చేసుకోవచ్చునని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం వ్యర్థ పదార్థాల నుంచి వివిధ కళాకృతుల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పనికి రాని పేపర్లు,గ్లాసులు,క్లాత్ ఇతర పదార్థాలతో పలు వస్తువులు తయారు చేసుకోవచ్చునన్నారు. చేతి వృత్తుల్లో చిన్నారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో నైపుణ్యం వెలుగు చూస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు వై.అనసూయాదేవి,గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న చండీహోమం

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు గణేష్ నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ఈ నెల 23న గురువారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అలాగే 27న సోమవారం ఉదయం 9 గంటలకు సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.